ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 1 | సెప్టెంబర్ 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-01-1985, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం బహుజన్మల నుండి పోగుచేసుకొన్న సంస్కారాలవల్ల అసలు భగవంతుడు లేడని ఇటువంటి భావాలు మనకు వస్తూ ఉంటాయి. పరమాత్మ మన హృదయంలో ప్రత్యక్షంగా ప్రకాశిస్తున్నప్పటికి జన్మాంతరాలలో మనకున్న సంస్కారాల వల్ల ఉన్న వస్తువు లేనట్లుగా, లేని వస్తువు ఉన్నట్లుగా మనకు అనిపిస్తుంది. అసలు పరమాత్మ విషయం అటు ఉంచండి. లోకానికి సంబంధించినంత వరకూ మీ హితవు కోరేవారు, మీ అభివృద్ధిని కోరేవారు మీ బంధువులలో కాని, మీ స్నేహితులలో కాని ఎంతమంది ఉన్నారు. మీ శ్రేయస్సుకాని, మీ అభివృద్ధిని కాని కోరని వారు ఇంక మిమ్మల్ని ఏమి ప్రేమిస్తారు? భగవంతుడి గురించి మీకు ఏమి చెపుతారు? మీకు మోక్షాన్ని ప్రసాదించమని ఏమి కోరతారు. మన మనస్సులో మలం ఉండటం వలన మనకు వెలుగు కనిపించటం లేదు. శరీరంలో ఉన్న మలం ఏదయినా మాత్ర వేసుకొంటే పోతుంది, లేకపోతే ఆముదం పుచ్చుకొంటే పోతుంది. కాని మనస్సులో ఉన్న మలం మాత్ర వేసుకొన్నా, ఆముదం పుచ్చుకొన్నా కూడా బయటకు వెళ్ళదు. ఆ మలం ఎక్కడ నుండి వచ్చింది అంటే బహుజన్మలనుండి మనం పోగు చేసుకొన్న వాసనలే మనస్సులో ఉన్న మలం. మన మనస్సులో ఉన్న మలదోషం పోగొట్టటానికి భజనలని, పూజలని, జపం అని, ధ్యానం అని, గురుసేవ అని, తీర్థయాత్రలు అని ఇలా అనేక ఉపాయాలను మన పెద్దలు మనకు చూపించారు. ఏ సంస్కారాలు అయితే ఏ వాసనలు అయితే ఈ జన్మలో ఈ శరీరం ఉండగా మనలను బాధపెడుతున్నాయో అవన్నీ ఒకప్పుడు మనం ఎంతో ప్రీతితోటి, ఇష్టంతోటి ప్రాక్టీసు చేసి తెచ్చుకొన్నవే,

అవన్నీ ఈ రోజు మనలను పీడిస్తున్నాయి.

ఆధ్యాత్మికజీవితం అంటే మీ ఉద్దేశం అరగంట సేపు జపం చేయుటమో, పూజ చేయుటమో అనుకొంటున్నారు. అది మంచిదే కాని అంతటితోటి సరిపెట్టుకోకూడదు. మనం మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మాట బయటది, మనస్సులోపలిది. శరీరం పైన ఉన్న కురుపుకు ఆపరేషన్ చెయ్యలేని వైద్యుడు లోపల ఉన్నపేగులకు ఆపరేషన్ ఎలా చెయ్యగలడు? అదే విధంగా శరీరం మీద ఉన్న బాడే తొలగించుకోలేనప్పడు మనస్సులో ఉన్న బాడిని ఎలా తొలగించుకోగలము. అందుచేత ఎవరైతే మనస్సును నిగ్రహించుకోవాలి అనుకొంటున్నారో వారు ముందు మాటను నిగ్రహించుకోవాలి. మాటలో నియమం, మాట నిగ్రహం ఉన్న వారికి మనోనిగ్రహం వస్తుంది. మనం మాటలను గాలికి వదిలేసి, మాటలలో నిగ్రహం లేకుండా, ఓర్పులేకుండా, మాటలో ఒక తీరు లేకుండా ఉంటే మనస్సు స్వాధీనం లోనికి రాదు. ఎందుకు మాటను స్వాధీనం చేసుకోవాలి అంటే మాటనిగ్రహం వలన మనోనిగ్రహం వస్తుంది. ఎంత చదువు ఉన్నా, డబ్బు ఉన్నా, పలుకుబడి ఉన్నా మనోనిగ్రహం రాదు. ఆడంబరం లేకుండా జీవిస్తే అంటే ఆడంబరం లేకుండా మాట్లాడటం, వేషధారణలో ఆడంబరం లేకుండా ఉండటం అలా మీరు కూర్చొన్నా, మాట్లాడినా, ఎక్కడ ఏ పరిస్థితిలో ఉన్నా ఆడంబరానికి దూరంగా ఉంటే అప్పడు మనస్సు స్వాధీనం లోనికి వస్తుంది. అంతేగాని మనం ఏదో పది నిమిషాలు పూజ చేసి, జపం చేసి ఆడంబరంగా జీవిస్తూ ఉంటే మనస్సు స్వాధీనం లోనికి రాదు, సత్యం మనకు తెలియబడదు.

దైనందిన జీవితంలో మనం చూసే చూపులో, వినేమాటలలో, మాట్లాడే మాటలలో అన్నింటిలో జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది లోపలకు తీసుకొనే తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటారు కాని లోపలనుండి బయటకు వచ్చే మాటల విషయంలో జాగ్రతగ్గా ఉండరు. దీనివలన లోపల మలం పెరుగుతుంది అంటే కల్మషం పెరుగుతుంది. మనస్సులో క్షోభ పుడుతుంది. మనం ఆత్మయందు దృష్టిపెడితే, పరమాత్మ యందు భక్తి కలిగి ఉంటే అసలు నిగ్రహించుకోవటానికి మనస్సు అనేది ఉండదు. ఎవడయితే తన మనస్సును భగవంతుడి మీద పెడుతున్నాడో వాడే భక్తుడు. మీరు కూడా పరిశీలన చేసుకోండి. మీ మనస్సు కనుక భగవంతుడి మీద ఉంటే మీరు భక్తులు. మనస్సు ఎక్కువగా జరిగిపోయిన గొడవలు చింతిస్తుంది, భవిష్యత్ గురించి ఆలోచిస్తుంది కాని ఆత్మ దగ్గరకు ప్రయాణం చెయ్యదు. జరిగిపోయిన గొడవలు అబద్ధమే, భవిష్యత్ అబద్ధమే, రాబోయే జన్మలు అబద్ధమే, ఇవి అన్నీ స్వప్నసమానం. మనస్సు ఈ స్వప్నాల గురించి ఆలోచిస్తుంది కాని, మన హృదయంలో

ప్రకాశిస్తున్న నిజమైన వస్తువు వైపుకు మనస్సు ప్రయాణం చెయ్యదు. దీనికి మనస్సులో ఉన్న మలం కారణం.

ఆత్మ ఒక్కటే నిజం. మనకు ఆత్మకంటే సన్నిహితంగా ఉన్న వస్తువు ఈ సృష్టిలో ఏదీ లేదు. శరీరం పుడుతుంది, చనిపోతుంది. దానితో ఆత్మకు ఎట్టి సంబంధం లేదు. లోపల ఉన్న అజ్ఞానం వలన ఈ ఆరు అడుగుల శరీరమే మనం అని మనకు అనిపిస్తోంది. పూజ, జపం ఎందుకంటే మనస్సును శుద్ధి చేసుకోవటమే వాటియొక్క ప్రయోజనం. మనస్సు కనుక పవిత్రంగా ఉంటే, నిర్మలంగా ఉంటే ప్రాపంచిక సంకల్పం ఏమయినా వచ్చినా అవి కాలిపోతాయి, మనస్సు నిర్మలంగా లేకపోతే సంకల్పం దానిని విజృంభించేలా చేస్తుంది. ఆధ్యాత్మిక జీవితంలో ఎవరయితే అడుగుపెట్టారో వారు ముందు ఆడంబరం లేకుండా జీవించటం నేర్చుకోవాలి. ఆడంబరం లేకుండా మాట్లాడటం నేర్చుకోవాలి, ఐశ్వర్యాన్ని కాని, కీర్తినికాని, అంగబలాన్ని కాని ఈ ప్రపంచంలో దేన్ని చూసికూడా గర్వం తెచ్చుకోకుండా జాగ్రత్తగా ఉండాలి. యదార్థం చెప్పాలంటే మనకి శత్రువులు ఎవరూ మన బయట లేరు. మన మనస్సు, మన యింద్రియాలే మన శత్రువులు. వాటితో పేచీపెట్టుకోకుండా ఎవరయితే ఈ మనస్సును, యింద్రియాలను మచ్చిక చేసుకొంటున్నారో అవి స్వాధీనపడి ఆత్మను తెలుసుకోవటానికి మనకు సహకరిస్తాయి. మన మనస్సు, యింద్రియాలు మన స్వాధీనంలో ఉంటే ఎదుటి మనుషులు ఎవ్వరూ మనకు అపకారం చెయ్యలేరు. అందుచేత ఎదుటి వారి విషయం వద్దు. మన మనస్సు, యింద్రియాలు మనకు ఎంతవరకు స్వాధీనంలో ఉన్నాయి అనేది చూసుకోండి. ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించేవారికి యింద్రియనిగ్రహం, మనోనిగ్రహం చాలా ముఖ్యం.

ఈ శరీరం చనిపోయాక కాలిబూడిద అయిపోతాము, మరల జన్మ అంటూ ఏమీ లేదు, భగవంతుడు లేడు అని కొంతమంది అంటారు. ఈ రకంగా మాట్లాడేవారిని చూసి మనం కోపం తెచ్చుకోకూడదు, వారిని చూసి జాలిపడాలి. మన మనస్సులో దోషం ఉన్నప్పుడు మనకు యిటువంటి భావాలు వస్తాయి. భగవంతుడు లేడని, సత్యం లేదని మీకు అనిపిస్తోంది అనుకోండి. దీని గురించి పుస్తకాలు చదవనక్కరలేదు, ఎవరినీ అడగనక్కరలేదు, మీ మనస్సులో దోషం ఉందని మీరు కొండగుర్తు పెట్టుకోండి. మీ మనస్సులో దోషం ఉన్నప్పుడు నిజం అబద్ధంగా, అబద్ధం నిజంగా మీకు కనిపిస్తుంది. మన చుట్టుపక్కల ఎవరికయినా కలరా, మసూచికం, పొంగు ఏమైనా జబ్బులు వస్తే అవి మనకు కూడా వస్తాయని మనం భయపడుతున్నాము కాని ఎదుటివారిలో ఉన్న రాగద్వేషాలు వచ్చి మనమీద పడుతున్నాయని, మనం అజ్ఞానంలో కూరుకొని పోతున్నాము అని మనం ఎప్పుడయినా భయపడుతున్నామా?

మనం భయపడటంలేదు ఎందుచేత నంటే మనం శరీరానికి యిచ్చే విలువ మనస్సుకు ఇవ్వటంలేదు. మీ శరీరానికి ఇచ్చే విలువ మనస్సుకు ఇవ్వనప్పుడు ఇంక మీరు ఆత్మను ఏమి తెలుసుకుంటారు. మీరు ఇల్లుని శుభ్రం చేసుకొంటున్నారు కాని మనస్సును శుచి చేస్తున్నారా? మీరు ఇంటికి యిచ్చే విలువ కూడా మనస్సుకు ఇవ్వటంలేదు. మీరు ఇంటిని దులుపుకొంటున్నారు కాని మనస్సును దులుపుకోవటం లేదు. మీరు ఇంటిని చీపురుతో ఎలా దులుపుకొంటున్నారో అలాగేమనస్సును కూడా దులుపుకోవటానికి, మనస్సును పవిత్రం చేసుకోవటానికి ఈశ్వరనామాన్ని స్మరించమని మన పెద్దలు చెప్పారు. పరమేశ్వరుడి మీద ప్రీతి పెంచుకోవటం వలన, నిరంతరం పరమేశ్వరనామాన్ని స్మరించటం వలన, ఆయన పాదాలను ఆశ్రయించటంవలన అహంకారం నెమ్మదిగా పలచబడిపోయి, మీకు తెలియకుండా రాలిపోతుంది. ఎవడయినా దొంగ మీ ఇంట్లో దొంగతనం చేయాలనుకొన్నాడు అనుకోండి, ఆ రోజునే రాడు. ముందు మీ యింట్లో గుమ్మాలు ఎక్కడ ఉన్నాయి, ఇంట్లో మనుషులు ఎవరు ఉన్నారు వంటి వివరాలు అన్నీ తెలుసుకొని ఎప్పడో ముహూర్తం పెట్టుకొని దొంగతనానికి వస్తాడు. అదేవిధంగా పరమేశ్వరుడు కూడా దొంగలాంటివాడు. మనం ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా ఆయన మన అహంకారాన్ని తీసివేయాలని నిర్ణయానికి వచ్చినప్పడు, దొంగవాడు మనకు తెలియకుండా మన యింట్లో వస్తువులను ఎలా పట్టుకొనిపోతాడో అలా మనకు తెలియకుండా మన అహంకారాన్ని రాలగొట్టి పట్టుకొనిపోతాడు.

భగవంతుడు మీకు ఎన్ని బహుమానాలు యిచ్చినా, ఎక్కడో సింహాసనం మీద కూర్చోబెట్టినా అది అంతా మాయ. ఎప్పడయితే మనలో ఉన్న అహంకారాన్ని తీసివేస్తాడో అప్పడే మనం భగవంతుడి స్వరూపాన్ని పొందుతాము. అది ఒక్కటే నిజం. మిగతా వాటిని మనం నిజం అనుకొన్నప్పటికీ అవి అన్నీ స్వప్నంతో సమానము. ఈ లోకంలో ఉన్న వస్తువులు అన్నీ కూడా ఈ వేళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయేవే. అందుచేత వాటి గొడవ మీకు వద్దు. మీ హృదయంలో ఉన్న సత్యవస్తువును పొందటానికి ప్రయత్నం చేయండి. మన హృదయంలో ఉన్న సత్యవస్తువును వదిలేసి మనకు రాబోయే జన్మలో ఏమవుతుంది, మనకు మంచి జన్మ రావాలి అని ఇలా ఎక్కడో కాలం గురించి ఆలోచిస్తూ ఉంటారు, దీనికి కూడా మనస్సులో ఉన్న దోషం కారణం. కృష్ణుడికాలంలో మనం లేము, రాముడి కాలంలో మనం లేము అని కొంత మంది అంటారు. ఆ శరీరాలా రాముడు, కృష్ణుడు? ఎప్పడయినా ఆత్మ లేకుండా ఉందా? ఆత్మ అప్పడూ ఉంది, ఇప్పడూ ఉంది. భవిష్యత్‌లో ఉంటుంది. అంటే ఆత్మ ఎప్పడూ ఉంది. మన మనస్సుకు భూత, భవిష్యత్, వర్తమానం కాని ఆత్మకు కాలం ఏమిటి? ఇది

అంతా మనస్సు యొక్క కల్పన. గతించినజన్మ అని, రాబోయేజన్మ అని ఈ జన్మల గురించి మాట్లాడే విషయాలు అన్నీ మనస్సు చేసే గారడీ. ఎప్పుడయితే అహంకారం అణిగిందో, ఆత్మ దర్శనం అయిందో అప్పుడు మిమ్మల్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు. గతించింది అంతా స్వప్నంలా అనిపిస్తుంది. ఆత్మను తెలుసుకోవటం వలన మనం పరాయివాళ్ళ యింటికి వెళుతున్నాము అనుకోవద్దు. ఆత్మే మన నిజమైన ఇల్లు. ఆ నిజమైన ఇంటికి చేరుకొనేవరకూ ఈ శరీరాలు అనే కొంపలలోనికి వెళ్ళాలి. మీకు ప్రకృతి యందు వాసన ఉంటే, కోరిక ఉంటే ఇంక పరమాత్మ దొరకడు. భక్తి అనేది కూడా గంగ. మనం భక్తితో మనస్సును శుచి చేసుకోవాలి. మనలను ఎవరో ఇతరులు మోసం చేస్తున్నారు అనుకొంటాము కాని మన యింద్రియాలు, మనస్సు మనలను మోసం చేస్తున్నాయి. పరమేశ్వరుడిని నిరంతరం స్మరణ చేయగా చేయగా మనస్సు పవిత్రం అయ్యి మోక్షానికి దారి కనిపిస్తుంది.

ఈ సృష్టిని అంతా గుణాలే నడిపిస్తున్నాయి. ఈ ప్రపంచాన్ని, ప్రతీ జీవుడిని నడిపేది గుణాలే. పరమేశ్వరుడు సాక్షిగా ఉన్నాడు. రాత్రి దీపం దగ్గర కొంతమంది చదువుకొంటారు, కొంతమంది పేకాట ఆడతారు. నువ్వు చదువుకొంటున్నావు నీకు ఎక్కువ కాంతిని యిస్తాను అని దీపం చెప్పదు, నువ్వు పేకాడుతున్నావు నీకు కాంతిని ఇవ్వనని చెప్పదు, అందరికి ఒకేరకంగా కాంతిని యిస్తుంది. అయితే పేకాట ఆడేవాడిని, చదువుకొనేవాడిని అలా చెయ్యమని దీపం చెప్పిందా? లేదు, వాడి గుణాన్ని బట్టే చేస్తున్నాడు. మన గుణాలను బట్టి మనం ప్రకృతిలో తిరుగుతున్నాము. దీపం ఏవిధంగా అయితే చెప్పదో అలాగే మనం మంచిచేసినా, చెడ్డ చేసినా ఆయన ఏమీ అనడు, ఈశ్వరుడు సాక్షిగా ఉంటాడు. మనలో తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలు తిరుగుతూ ఉంటాయి. సత్వగుణం వచ్చినప్పుడు దానిని పట్టుకొని , దాని పాదాలను ఆశ్రయించి నెమ్మదిగా అభివృద్ధి చేసుకొంటే అది ఎక్కువ కాలం ఉంటుంది. సత్వగుణం ఎంతమంచిది అంటే పరమాత్మను చేరుకోవటానికి దారి చూపించి అది పక్కకి తప్పకొంటుంది. అప్పుడు మనిషి గుణాతీతుడు అవుతాడు. ఎవడయితే గుణాతీతుడు అయ్యాడో వాడు మాయను జయించినట్లు, ఎందుచేతనంటే మాయ ఈ మూడు గుణాలరూపంలో ఉంది. ఎవడయితే మాయను జయించాడో వాడు నా స్వరూపాన్ని పొందుతాడు అని పరమాత్మ గీతలో చెప్పాడు.

మనం ఆడంబరం లేకుండా జీవిస్తూ ఉంటే, మనం ఆడంబరం లేకుండా మాట్లాడుతూ ఆడంబరం లేని చేష్టలతో జాగ్రత్తగా జీవిస్తూ ఉంటే జ్ఞానం దానంతట అదే వచ్చేస్తుంది. మీకు ఎంతో చదువు ఉందనుకోండి, ఎంతో ధనం ఉంది అనుకోండి దానివలన మనస్సు అంతర్ముఖం

అవుతుందా అంటే అవ్వదు. కేవలం ఈశ్వరుని దయవల్ల మాత్రమే మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అయితేగాని జ్ఞానం రాదు. మీరు ఎన్ని పాటలు పాడి, ఎన్నిస్తోత్రాలు చేసి, ఎంతమంది దేవుళ్లను ఆరాధించినప్పటికి మీ మనస్సు బహిర్ముఖం అవుతూ ఉంటే మీకు సత్యం తెలియబడదు. మనస్సు అంతర్ముఖం అవ్వాలి. లోపల తలంపు ఎక్కడ పుట్టివస్తోందో ఆ మూలం తెలిస్తేగాని అది నశించదు. బయట స్తోత్రాలవలన అది నశించదు. స్తోత్రాలు కొంతవరకు ఉపకారం చేస్తాయి. రామకృష్ణుడిని పరమహంస అంటారు, పాలు నీళ్ళు కలిపి పెడితే హంస నీటిని వదిలేసి పాలను తాగేస్తుంది. అలాగే రామకృష్ణుడు మాయను వదిలేసి సత్యాన్ని పట్టుకొన్నారు. హంసకు పాలను, నీళ్లను వేరుచేసే శక్తి ఎలా ఉందో అలా ఏది నిజం, ఏది నిజం కాదు అని విడదీసుకొనే శక్తి మన మనస్సుకు రావాలి. అటువంటి వివేకం ఎవడికయితే కలిగిందో వాడు నిజాన్ని తెలుసుకొంటాడు. అదే వాడికి చివరిజన్మ. మీరు ఫలితం కోసం ఎదురుచూడకుండా చేసేది ఏదో నెమ్మదిగా, ప్రశాంతంగా చేస్తూ ఉంటే ఈశ్వరుడు మిమ్మల్ని ఎప్పుడు ఎక్కడ ఎలా అనుగ్రహించాలో ఆయనే చూసుకొంటాడు. ఎవరికి అవమానాలు అంటే ఇష్టం ఉండదు. బహుమానాలు అంటేనే అదరికి ఇష్టం. కాని బహుమానాల వలన, పొగడ్తలవలన మనస్సు బహిర్ముఖం అవుతుంది. అవమానాల వల్ల అంతర్ముఖం అవుతుంది. ఆ సంగతి తెలియక అందరూ మనకు బహుమానాలు ఇవ్వాలి అనుకొంటారు. ఎవరైనా అవమానం చేస్తే మనకు మనస్సు అంతర్ముఖం అవుతుంది. ఒకరకంగా వారు మనకు ఉపకారం చేస్తున్నారు. బహుమానాల వలన మనస్సు బహిర్ముఖం అవుతుంది. బహిర్ముఖం అయిన మనస్సుకు సత్యం తెలియబడదు.

మీరు నాకు పదిరూపాయలు బాకీ ఉన్నారు అనుకోండి, ఆ పదిరూపాయలు ఇచ్చేస్తే బాకీ తీరిపోయింది అని మీకు ఎంతో తేలికగా అనిపిస్తుంది. అదే విధంగా ఈ శరీరంలో మీరు ఏదయినా చెడ్డకర్మ అనుభవించవలసివస్తే ఋణం తీర్చేస్తున్నాము అని సంతోషంగా అనుభవించండి. అంటే బాకీ తీర్చేస్తున్నారు అన్నమాట. శరీరంతో సుఖం అనుభవిస్తే పుణ్యం ఖర్చు అవుతుంది, దుఃఖం అనుభవిస్తే పాపం ఖర్చు అవుతుంది. పుణ్యం ఖర్చు అవ్వటం మంచిదా, పాపం ఖర్చు అవ్వటం మంచిదా? కష్టాలు అనుభవించటం వలన ఋణం తీరిపోతుంది. అంటే పాపం ఖర్చు అయిపోతుంది, అది మంచిదే కదా. అందుచేత పరమేశ్వరుడు మనకు ఏది ప్రసాదించినా అది మంచి అయినా, చెడ్డ అయినా దానిని ఎవడయితే ఆయన మీద పూర్ణ విశ్వాసంతో, ఆయనకు శరణాగతి చెంది ప్రశాంతంగా అనుభవిస్తున్నాడో వాడికి కొత్త వాసనలు పుట్టవు, పాత వాసనలు మరణిస్తాయి. అంటే మనస్సుకు ఎదురు తిరగకుండా

ఎవడయితే ప్రశాంతంగా తన ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడో వాడికి పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు పుట్టవు. ఎవరయితే సత్యాన్ని తెలుసుకోవాలి అనుకొంటున్నారో, ఎవరయితే ప్రకృతిలోనుండి విడుదల అవ్వాలి అనుకొంటున్నారో వారు పవిత్రులు అయ్యి ఉండాలి. పవిత్రులు కానివారికి జ్ఞానం రాదు. ధనం లేనివారు దరిద్రులు కాదు, ఎవరయితే పవిత్రులు కారో, ఎవరికయితే ప్రేమ లేదో వారే దరిద్రులు అని గాంధీ చెప్పారు. ప్రేమలేని జీవితం గడిపేవారికి పరమేశ్వరుడు వ్యక్తంకాడు.

మనస్సును జయించటం కష్టం. ప్రపంచంలో ఉన్న పెద్దచక్రవర్తి కంటే మనస్సును జయించినవాడే ఎక్కువ సుఖపడతాడు అని శాస్త్రం చెపుతోంది. మనస్సును జయించటానికి అసలు అది ఉంటే కదా అంటారు రమణస్వామి. ఉన్నది ఒక్కటే వస్తువు, అదే ఆత్మ. రెండోది లేదు. మీరు ఆత్మయందు దృష్టి పెట్టుకోండి. మనస్సు దానంతట అదే నశిస్తుంది. నువ్వు ఆత్మను కనుక దర్శిస్తే మనస్సు అంటూ లేదు. మనస్సులో ఉన్న దోషాలు అన్నీ రాలిపోతే మనస్సు పరిశుద్ధమవుతుంది, అప్పుడు శుద్ధ మనస్సే పరబ్రహ్మంగా ప్రకాశిస్తుంది. నీ మనస్సు నిజంగా శుద్ధంగా ఉంటే, నీ మనస్సు చలించకూడదు, నీకు దుఃఖం రాకూడదు. దీనినిబట్టి మీ మనస్సు శుచిగా ఉందో లేదో చూసుకోండి. నామరూపాలకు సంబంధించిన జ్ఞానం ఏదీ జ్ఞానం కాదు. అది సత్యాన్ని తెలుసుకోవటానికి పనికిరాదు. అది అంతా స్వప్నం. ఆత్మఒక్కటే నిజం. మనస్సు నశించిన చోటే ఆత్మదర్శనం అవుతుంది. ఈ మనస్సు అనే సమస్యను ఎవరయితే పరిష్కరించుకొన్నారో వారికే జ్ఞానం కలుగుతుంది. నేను అలా ఉండాలి, ఇలా ఉండాలి అనుకొంటారు. వారికి జ్ఞానం రాదు. ఆత్మ అలా ఉండదు, ఇలా ఉండదు. ఇది అంతా మనస్సు యొక్క కల్పితం. పుస్తకాలు చదివి, నాలుగు శ్లోకాలు బట్టీపట్టి మేము పండితులం అయిపోయాము, మాకు జ్ఞానం వచ్చేసింది అనుకొంటే మీరు బోర్లాపడతారు. అలా మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు. జ్ఞానం పుస్తకాలలో లేదు. మీరు పుస్తకాలను కాదు ధ్యానం చేయవలసింది. భగవంతుడు మీ హృదయంలో ఉన్నాడు. మీ హృదయంలో ఉన్న నన్ను ధ్యానం చేయండి. అప్పుడు మీకు తెలియబడతాను అని పరమాత్మ చెప్పాడు.

మనం మనుషులతో స్నేహం చేస్తున్నాము కాని పరమాత్మతో స్నేహం చేయటంలేదు. ఎవడు భగవంతుడితో స్నేహం చేస్తున్నాడో వాడికి భగవంతుడు తెలియబడతాడు. మీలో 40 సంవత్సరాలు, 60 సంవత్సరాలు వయస్సు ఉన్నవాళ్ళు ఉన్నారు. ఇంతకాలంలో ఎందరితోనో స్నేహం చేస్తున్నారు కాని ఎప్పుడయినా భగవంతుడితో స్నేహం చేసారా? బాగా యిష్టమైన స్నేహితులు మీ మనస్సులో జ్ఞాపకం వస్తూ ఉంటారు కదా. మీరు భగవంతుడితో స్నేహం చేసి

ఉంటే మీకు భగవంతుడు జ్ఞాపకం వచ్చి ఉండేవాడు. మనం అజ్ఞానం కల్పించిన అడివిలో పడి తిరుగుతూ దారి తెలియక ఆత్మ లేదు, నిజం లేదు అనుకొంటున్నాము. మన హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకోవాలి అనే బుద్ధి మనకు కలగటం లేదు. కాని రాబోయే జన్మ ఎటువంటిది వస్తుంది, భవిష్యత్ ఎలా ఉంటుంది అని ఇటువంటి ఆలోచనలతో అబద్ధం చుట్టూ తిరుగుచున్నాము. మీరు ఏదో పని చెయ్యటం వలన ఆత్మ తెలుస్తుంది అనుకోవద్దు. అది ఏదో పని చేయటం వలన వచ్చేదికాదు. నా శబ్దం మీకు తక్కువ ఉపకారం చేస్తుంది. నిశ్శబ్దం ఎక్కువ ఉపకారం చేస్తుంది. శబ్దంకంటే నిశ్శబ్దం గొప్పది అంటే మాటకంటే మౌనం గొప్పది. శబ్దం చెఱువుతో సమానము, నిశ్శబ్దం సముద్రంతో సమానము.

మేము వాళ్ళకు ఉపకారం చేస్తున్నాము, వీళ్ళకు సేవ చేస్తున్నాము అని కొంతమంది అంటూ ఉంటారు. దాని వలన కూడా అహంకారం పెరుగుతుంది. ఉపకారం చేయాలి, సేవ చేయాలి అనేవాడు మీలో ఒకడు ఉన్నాడు కదా. మీరు ఎంతజాగ్రత్తగా మెలుకవగా ఉండాలో తెలియటం కోసం చెపుతున్నాను. కొంతమంది రూపాయి ఉపకారం చేస్తారు. రెండు రూపాయల అహంకారం పెంచుకొంటారు. అంటే ఉపకారం పేరుమీద ఈశ్వరుడికి దూరం అవుతున్నారు. ఇక్కడ మనం చేయవలసింది ఏమిటి అంటే మనలో ఎవడయితే ఉపకారం చేయాలని చూస్తున్నాడో వాడు ఎవడో తెలుసుకోవాలి. తరువాత ఉపకారం చెయ్యవచ్చు. కంగారుపడకండి. ఆ ఉపకారం చేసేవాడు ఎవడు? ముందువాడిని పట్టుకోండి. ఏదో వ్యవహారానికి జగత్తు నిజం అని ఒప్పకొన్నప్పటికీ, వాస్తవంలో జగత్తు లేదు అంటున్నారు ఆచార్యులవారు. మనకు కనిపిస్తున్న జగత్తు, మనకు ఉన్న జీవభావన అన్నీ స్వప్నంతో సమానము. ఎందుచేతనంటే మనకు గాఢనిద్రలో జీవభావనలేదు, లోకభావన లేదు, దైవభావన లేదు. మీరు జాగ్రత్తగా ఆలోచించుకోండి. గాఢనిద్రలో ఉండగా మీకు జీవుడు, ప్రపంచం, దేవుడు ఎవరైనా గుర్తున్నారా అంటే లేరు. అక్కడ దేవుని గొడవ, జీవుడి గొడవ, లోకం గొడవ ఏమీ లేదు కాని గాఢనిద్రలో మనం ఉన్నాము. మన శరీరంతో సంబంధం లేకుండా అక్కడ మనం సుఖంగా, శాంతిగా ఉన్నాము, హాయిగా నిద్రపోతున్నాము. చావుతోగాని, పుట్టుకతోగాని ఏమీ సంబంధం లేకుండా అక్కడ మనం ఉన్నాము. గాఢనిద్రలో ఉన్న ఎవరు మనం? గాఢ నిద్రలో ఉన్నది ఇప్పడు జాగ్రదవస్థలో కూడా ఉంది. అయితే గాఢనిద్రలో ఉన్న స్థితి ఇప్పడు ఎందుకు అనుభవంలోనికి రావటం లేదు అంటే దానికి తలంపులు కారణం అన్నారు భగవాన్. గాఢనిద్రలో ఉన్న సుఖం, జాగ్రదవస్థలో ఉన్న ఎఱుక ఒకేసారి మనకు అనుభవంలోనికి రావాలి. మనకు నిద్రకాని నిద్ర కావాలి. నిద్రలో ఎలా ఉన్నారో ఇప్పడు జాగ్రదవస్థలో అలాగ ఉండ

మంటున్నారు. ఎవడికయితే నిద్రకాని నిద్రవచ్చిందో వాడు జ్ఞాని అవుతాడు. అంటే మీరు మెలుకువగా ఉండాలి, నిద్రలో ఉన్న స్థితి తెచ్చుకోవాలి. అంటే వాడు సమాధిస్థితిని పొందుతాడు.

యావత్తు సృష్టిని నడిపే ఈశ్వరుడు మీకష్టసుఖాలు చూడలేడా, మీ భారం మోయలేడా? సోదరమహాశయులారా! నిజమైన త్యాగం ఏమిటి అంటే ఎవడయితే తన అహంకారాన్ని విడిచిపెడతాడో వాడే నిజమైన త్యాగి, వాడే జ్ఞాని అవుతాడు. జ్ఞానికానివాడు సుఖికాలేడు, మనం పూజపేరుతో, భక్తిపేరుతో అహంకారాన్ని పెంచుకొంటూ జ్ఞానానికి దూరం అవుతున్నాము. మనలో అహంకారం ఎప్పుడయితే రాలిపోయిందో అక్కడే స్వరూపం ఉంది. మనలను దేవుడి నుండి ఏదయితే వేరు చేస్తోందో, నా స్వరూపం నుండి నన్ను ఏదయితే వేరు చేస్తోందో ఆ వేరు చేసేదానిని పోగొట్టేవాడే గురువు. నిజమైనసుఖం నీ హృదయంలోనే ఉంది.. అయితే ఆ సుఖం ఇప్పుడు నాకు అనుభవంలో లేదు. నా హృదయంలో ఉన్న సుఖం నాకు అనుభవం లోనికి రాకుండా ఏదయితే అడ్డువస్తోందో దానిని తొలగించేవాడే నిజమైనగురువు.

మీవల్ల మాకు శాంతి వస్తోంది, సుఖం వస్తోంది అని కొంతమంది అంటారు. అది కూడా అబద్ధమే. నేను మీకు జ్ఞాపకం రావటం వలన మీ మనస్సు అంతర్ముఖం అయితే, మీ హృదయంలో ఉన్న సుఖం, శాంతి మీ మనస్సుకు తగిలి మీకు సుఖం వస్తోంది. మీ శరీరం ఎటువంటిదో నా శరీరం కూడా అటువంటిదే. ఆ సుఖం మీదే కాని నాది కాదు, కాని నా వలన వచ్చినదానివలె అది కనిపిస్తోంది. అది అబద్ధం. ఆత్మకి మరోపేరే సుఖం. మనకు అందరికి సుఖం కావాలి. మాకు శరీరం అక్కరలేదు అని చెప్పవచ్చు కాని మాకు సుఖం అక్కరలేదు అనేవారు ఎవరయినా ఉన్నారా? కాని మనలో ఉన్న దోషం ఏమిటి అంటే సుఖం మన అందరికీ కావాలి కాని, అది ఎక్కడ ఉందో మనకు తెలియటం లేదు. ఎవరయితే తమ దేహప్రారబ్ధాన్ని యిష్టంగా, సంతోషంగా అనుభవించటం లేదో వారికి కొత్త వాసనలు వస్తాయి. మనం దేహంతో ఏ పని చేయాలో ఆ పని చెయ్యటం మనకు ఎలాగు తప్పదు. ఆ చేసేది బాధపడుతూ చేయటం కంటే సంతోషంగా చేస్తే మనకు తొందరగా జ్ఞానం కలుగుతుంది. మాయ ఇట్టిది అని మనం దానిని నిర్వచించలేము. మారుతున్నది మాయ. అది లేదు. ఉన్నదాని వలె కనిపిస్తోంది. అది నిజంగా ఉంటే పోదు. మాయని జయించాలి అంటే అసలు మాయ అంటే ఏమిటో అర్ధమవ్వాలి కదా. మాయను జయించకుండా ఈశ్వరుని పొందలేము. మాయ అనేది బయటలేదు, మీ తలంపులే మాయ. మీకు మంచి తలంపులో, చెడ్డ తలంపులో వస్తున్నాయి కదా. మాయ మీ తలంపుల రూపంలో ఉంది. మీరు తలంపులను

వదిలేసి మాయకోసం బయట వెతుకుచున్నారు. అందుకే అది దొరకటంలేదు.

మనం హరేరామ, హరేకృష్ణ, అరుణాచలశివా అంటున్నాము. భగవంతుడి నామం చేస్తున్నాము. ఇదంతా ఎవరు చేస్తున్నారు? మనస్సే చేస్తోంది. ప్రాపంచిక తలంపుల నుండి మనస్సును బయటకు తీయటం కోసం నామం పెట్టారు. హరేరామ అని అరుణాచల శివ అని మనస్సే అంటోంది. మనస్సు యొక్క మూలం కనుక మీకు తెలిస్తే మీరు ప్రార్థించే రాముడు గాని, కృష్ణుడుగాని, ఏసు గాని శివుడు గాని వచ్చి మీ ఎదుట నిలిచినా మీకు కళ్ళు ఎత్తి చూడాలని కూడా అనిపించదు. మీరు దేవుడిని ఎందుకు ప్రార్థిస్తున్నారు అంటే సుఖంకోసం, ఆ సుఖం మీకు అందితే, ఆ సుఖమే మీరు అయితే ఇంక మీకు దేవుడితో పని ఏముంది. మనం దేవుడిని స్మరించటం కూడా మనస్సు చేసే పనే. అదికూడా తలంపే. అది కూడా మాయలో ఒక భాగమే. మీరు ఏ దేవుడిని ఆరాధించినా బహిర్ముఖం అయిన మనస్సుకు సత్యం తెలియబడదు. ఎవరి సమక్షంలో మన మనస్సు అంతర్ముఖం అవుతుందో, ఎవరి ముఖం చూస్తే మన మనస్సు అంతర్ముఖం అవుతుందో వారే మహాత్ములు. మనస్సును అంతర్ముఖం చేయటమే గురువు చేసే మొదటిపని, మధ్యపని, చివరిపని కూడా అదే. మాయకు రూపం లేదు. మాయ తలంపుల రూపంలో వచ్చి మనలను ఆడిస్తోంది. మనకు తలంపులు రావాలంటే లోపల తలంచే వాడు ఒకడు ఉండాలి. ఆ తలంచేవాడు ఎవడు? వాడే జీవుడు. వాడికే కొత్త దేహాలు కావాలి, ప్రకృతి కావాలి. ఆ జీవుడికి మరో పేరే అహంకారం. లోపల జీవుడు ఉన్నంతకాలం జీవలక్షణాలు ఉంటాయి. నిగ్రహం, నిగ్రహం అంటే విషయం నీకు అర్థం కానప్పుడు నిగ్రహం ఏమి చేస్తుంది. ప్రకృతి నిన్ను గెంటి అవతల పారేస్తుంది. ముందు విషయం అర్థం చేసుకోవాలి. బలవంతాన నిగ్రహించుకొంటే అది ఆగదు. దీనికి డిస్క్రిమినేషన్ అంటే విడదీసుకొనే శక్తి అవసరం.

అసలు జరిగేది అంతా లోపలే జరుగుతోంది, బయట ఏమిలేదు. మీకు కోపం వస్తోంది అనుకోండి, కామం వస్తోంది అనుకోండి, ద్వేషం వస్తోంది అనుకోండి. అది బయటనుండి వస్తోందా, లోపలనుండి వస్తోందా? మీకు సమస్తం లోపలనుండే వస్తున్నాయి. ఇవి ఎక్కడ నుండి వస్తున్నాయి అని మీరు ఎప్పుడయినా మనస్సును లోపలకు గెంటారా? మీకు మంచి గుణాలు రానివ్వండి, చెడ్డగుణాలు రానివ్వండి అవి లోపలనుండే వస్తున్నాయి. అవి ఎక్కడ పుట్టి వస్తున్నాయి. ఆ స్థానం మీకు తెలిసేవరకు ఆ గుణాలు బయటకు వెళ్ళవు. ఆ గుణాలు మీ లోపల ఎక్కడ పుట్టి వస్తున్నాయో ఆ ప్లేస్ మీకు అర్థమయితే గాని ఆ గుణాలు మీకు దారి ఇవ్వవు. భగవంతుడు ఏమని చెప్పాడు అంటే ఎవరయితే నన్ను ప్రార్థిస్తున్నారో, ఎవరయితే

నేనే గతి అని నమ్మి నన్ను గమ్యంగా పెట్టుకొని జీవిస్తున్నారో వారికి జ్ఞానాన్ని అర్దం చేసుకొనే బుద్ధిని ప్రసాదిస్తాను అంటే ఎటువంటి సద్బుద్ధిని ప్రసాదిస్తే వారికి జ్ఞానం అందుతుందో అటువంటి బుద్ధిని ప్రసాదిస్తాను అని పరమాత్మ చెప్పాడు. మనం అందరం దేవుడిని తెలుసుకోవాలి అనుకొంటున్నాము. అందుకే కదా ఇక్కడకు వచ్చాము. దేవుడు ఉన్న మాట నిజం, దేవుడిని తెలుసుకోవాలి అనుకొనేవాడు అబద్ధం, మరి సాధనలు అన్నీ ఎవరు చేస్తున్నారు? దేవుడిని తెలుసుకొనేవాడు ఒకడు ఉన్నాడని ఒప్పుకొన్నాము కాబట్టి, లేనివాడిని తీసుకొచ్చి పీటవేసి కూర్చోపెట్టాము కాబట్టి సాధనలు చేయమంటున్నారు. మరల ఈ సాధనల పేరు మీద రాముడు గొప్పవాడని, ఏసుక్రీస్తు గొప్పవాడని ఇలా దెబ్బలాటలు. ఇది మూర్ఖత్వం. ఆ దేవుడు గొప్పవాడని, ఈ మతం గొప్పది అని, ఆ గురువు గొప్పవాడని ఇలా గొడవలు పెట్టుకోవటం. ఎంతమంది గురువులు ఉన్నారు? ఉన్నది ఒక్కటే వస్తువు, అదే ఆత్మ. గురుశబ్దానికి ఎవరు అర్హుడు అంటే ఎవడయితే ఆత్మను దర్శించాడో వాడు మాత్రమే గురువు. ఏవో నాలుగు మాటలు చెప్పినంతమాత్రాన వాడు గురువు కాదు, ఆత్మను దర్శించినవాడు గురువు. ఉన్నది ఒక్కటే వస్తువు. రెండు ఉంటే దీనికంటే అది గొప్పది, దానికంటే ఇది గొప్పది అని చెప్పవచ్చు. ఉన్నది ఒక్కటే అయితే ఇక గొప్పఏమిటి? తక్కువ ఏమిటి? ఇంక మీరు సబ్జక్టును ఏమి అర్థం చేసుకొంటున్నారు.

మీకు నాలుగు వేల రూపాయలు యిచ్చి చందా యివ్వమంటే ఇవ్వగలరు, డబ్బానూనె యిచ్చి ఖర్చుపెట్టమంటే పెట్టగలరు కాని నాలుగు నిమిషాలు ప్రశాంతంగా కూర్చొని సబ్జక్టు ఆలోచించమంటే ఆలోచించలేరు. ఇదే మాయ. కనుక మీరు ప్రశాంతంగా కూర్చోండి. మాటలు శ్రవణం చేయండి, వాటిని మనస్సులో పెట్టుకోండి. పుస్తకంలో ఉన్నది మస్తకం లోనికి రానివ్వండి. మీరు జాగ్రత్తగా మననం చేసుకోండి. మీ కాలంలో కొంతకాలాన్ని విషయం అర్థం చేసుకోవటానికి ఖర్చుపెట్టండి. మీరు బాహ్యమైన పనులు చాలా చేయగలుగుతున్నారు కాని, విషయాన్ని అర్థం చేసుకోవటానికి మీరు ప్రయత్నం చేయటంలేదు. అందుచేత మాయ మీకు దారి ఇవ్వటం లేదు. తిండిమీద ఎక్కువ కోరిక ఉన్నవాడు మనిషి జన్మ కోరుకోవద్దు. పంది జన్మ కోరుకోండి అని స్వామీజీ చెప్పారు. ఎందుచేతనంటే మనకి తినాలని ఉన్నా అజీర్తి చేస్తుంది. పందికి ఎంతతిన్నా అజీర్తి అనేది లేదు. మనకు అందరికి తలో శరీరం ఉంది. ఈ శరీరాన్ని ఏమి చేసుకొంటాము? దానితో మనకు పనేమిటి? ఈ శరీరం ఎందుకు వచ్చింది? దానితో మనం పొందవలసింది ఏమిటి? ముందు యిది నిర్ణయం చేసుకోండి. మనకు డబ్బు ఉంటే చందాలు యివ్వవచ్చు. దానివలన పుణ్యం వస్తుంది. కాని జ్ఞానం రాదు. మీరు

యింద్రియాలతో మంచి పనులు చేయవచ్చు. మంచి పనులు చేయటం వలన పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. ఎందుచేతనంటే లోపల కర్తృత్వం ఉంటుంది. ఈ మంచి పనులు నేను చేస్తున్నాను అనేవాడు ఒకడు ఉన్నాడు. కర్తృత్వం ఉన్నప్పుడు పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. ఎవడయితే కర్తృత్వాన్ని బలిచేస్తున్నాడో వాడు జ్ఞాని అవుతాడు.

ఇప్పుడు మనం ఇంటిదగ్గర చేసుకొనే పనులు మానేస్తే జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. మీ శరీరానికి ఎంతపని చెపుతున్నారో అలా మీ బుద్ధికి కూడా పని చెప్పాలి. మనం అన్ని యింద్రియాలకు పని చెపుతున్నాము, కాని బుద్ధిని గాలికి వదిలేస్తున్నాము. నిన్ను నడిపే డ్రైవర్ బుద్ధి అని భగవంతుడు చెపుతున్నాడు. కారులో కూర్చొన్నవారు పెద్దమనుషులే, కాని డ్రైవర్ సారాతాగి కారు నడుపుతున్నాడు. అప్పడు ఏమవుతుంది. మన పరిస్థితి అలానే ఉంది. బుద్ధిని గాలికి వదిలేసి నేనుబాగుపడాలి, నేనుబాగుపడాలి అంటే ఎలా బాగుపడతాము. మన బుద్ధిని బాగుచేసుకోకుండా మనం ఎలా బాగుపడతాము? మనలను నడిపేవాడు వాడే కదా. మనబుద్ధి నిర్మలం అవ్వాలి, కుదుటపడాలి. కొంతమంది మనుషులను చూస్తే సహనం ఆ రూపం ధరించిందా అని మనకు అనిపిస్తుంది. అటువంటి వారికి జ్ఞానం వస్తుంది. మనకు ఉన్న ధనం వలన, చదువువలన సహనం రాదు అనుకోండి, వినయం రాదు అనుకోండి ఇంక చదువు అనవసరం, ధనం అనవసరం. మీరు ఏకాంతంగా కూర్చోండి. ఏకాంతంగా ఉన్నప్పడు మీరు ఎవరో మీకు తెలుస్తుంది. ఏకాంతవాసం అవసరం అని గీతలో పరమాత్మ చెప్పాడు. నలుగురులో కూర్చొన్నప్పడు అందరు పెద్దమనుషులే, ఏకాంతంగా ఉన్నప్పడే మీరు ఏమిటో మీకు తెలుస్తుంది. అప్పడు మీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో అని చూసుకోవాలి కాని మీరు హిందూమతం అయితే ఏముంది, క్రైస్తవమతం అయితే ఏముంది, మీరు రాముడు భక్తులు అయితే ఏముంది, రమణభక్తులు అయితే ఏముంది?

మీలో ఉన్న అహంకారం అనే పెద్దరాయిని బయటకు గెంటేవాడు ఈశ్వరుడు ఒక్కడే. ఆ రాయి బయటకు పోతేగాని అసలు మీకు దారి కనబడదు. అహంకారం అనే రాయిని బయటకు గెంటటానికి అది మీకు బరువుకాని ఈశ్వరుడికి బరువుకాదు. మీకు అసాధ్యం ఉందికాని ఈశ్వరుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు, ఆయనకుఅన్నీ సాధ్యమే. భక్తి పేరు చెప్పి సఫరింగ్ వద్దు, ఎవరూ బాధపడకండి. మేము సాధన చేస్తున్నాము, సాధన చేస్తున్నాము అనుకొంటున్నారు. మీరు సాధన చేస్తున్నారు మంచిదే. రేపు రమణజయంతి కాబట్టి రేపటి లోపులో ఇంతకాలంనుండి సాధన చేస్తున్నాము, నాలో ఉండి ఎవడో సాధన చేస్తున్నాడు కదా, ఈ సాధన చేసేవాడు ఎవడు, ఎక్కడ ఉన్నాడు అని విచారణ చెయ్యండి. రేపటికి మీ

మనస్సు ఎలా ఉంటుందో చూడండి. మీ అందరినీ ఈశ్వరుడు ఎన్నుకొన్నాడు, ఎన్నుకోవటం పూర్తి అయిపోయింది. కాని మీలో ఉన్న అజ్ఞానాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా తొలగిస్తాడో ఆ టైము మటుకు ఆయనకు విడిచిపెట్టేయండి. ఈశ్వరుడు ఏ రూపంలో వస్తాడో, ఎప్పుడు మీ అజ్ఞానాన్ని తొలగిస్తాడో అది ఆయన పని. ఈశ్వరుడు మిమ్మల్ని సెలెక్ట్ చేయకపోతే మీరు ఆదివారాలు ఇక్కడికి రానేరారు. నేను ఏదో చెపుతున్నాను కాబట్టి మీరు వినటానికి వస్తున్నారు అని ఇక్కడ కారణం కనిపిస్తోంది కాని అది నిజంకాదు. ఈశ్వరుడు మిమ్మల్ని సెలెక్ట్ చేయకపోతే అసలు మీరు ఇక్కడకు రాలేరు. మీరు ఏమీ బరువులు మోయవద్దు. బరువు మోయటం వలన దుఃఖం వస్తుంది. బరువు అంతా ఈశ్వరుడిమీద వెయ్యండి, ఈశ్వరుడికి ఎదురు తిరగవద్దు. కొంతమంది నాకు పాదనమస్కారాలు చేస్తున్నారు, అవి అక్కరలేదు. మీరు విషయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మనస్సును కుదురుగా ఉంచుకొని, విన్న విషయాన్ని సబ్జక్టును అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. అదే నిజమైన నమస్కారం. నేను చెప్పే మాటలను మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయటమే మీరు నన్ను గౌరవించినట్లు.

కొంతమందికి కోరికలు నెరవేరటం వలన కూడా భక్తి పెరుగుతుంది. మనకి భగవంతుడు ఈ కోరిక నెరవేర్చాడుకదా, ఆయనపై భక్తి పెంచుకొందాము అని అలా భక్తిని పెంచుకొంటారు. బయట ఉన్న భగవంతుడికి మీరు దండలు వేసినా, దీపారాధన చేసినా, సహస్రనామాలు చదివినా ఆయన చేసే సహాయం ఏమిటి అంటే మీలోపల ఉన్న భగవంతుడి దగ్గరకు తీసుకొని వెళతాడు. బయట ఉన్న భగవంతుడు నిజంకాదు కాని, మీ లోపల ఉన్న భగవంతుని దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి ఆయన మీకు సహకరిస్తాడు. ఇది అంతా మీ కోసమే, ఆయన కోసం కాదు. భగవంతుడికోసం ఇది అంతా చేస్తున్నాము అని మీకు అనిపించవచ్చు కాని అది నిజం కాదు. భగవంతుడికి దండలు వేసినా, అష్టోత్తరాలు చేసినా ఇది అంతా మీ కోసం మీరు చేసుకొంటున్నారు. నాకంటే గుడిలో ఉన్న దేవుడే మెరుగు అనేవారు భగవాన్. గుడిలో దేవుడికి క్షీరాన్నం, అరటిపళ్ళు చూపించి పట్టుకొని పోతున్నారు కాని, నన్ను క్షీరాన్నం తాగమంటున్నారు, అరటిపళ్ళు తినమంటున్నారు. నా పుట్టినరోజు మీరు చేస్తున్నారు. నా పుట్టినరోజు చేస్తే మీకు ఏమి వస్తుంది. నా శరీరానికి పుట్టినరోజు ఎలా ఉందో మీ శరీరాలకు కూడా పుట్టినరోజులు ఉన్నాయి కదా. అందరు నేను, నేను అంటున్నారు కదా. మీకు అందరికి నేను అనే తలంపు ఉందికదా. మీరు రోజూ చేయలేకపోయినా మీ శరీరం పుట్టినరోజున అయినా కనీసం సంవత్సరంలో ఆ ఒక్కరోజున అయినా ఈ నేను అనే

తలంపు ఎక్కడ పుట్టిందో చూసుకోండి. అంతేగాని ఈ శరీరానికి దండలు వేయటం వలన ఏమి వస్తుంది అన్నారు భగవాన్.

చలంగారు ఏమన్నారు అంటే భగవాన్ కుమారస్వామి అవతారమా, ఈశ్వరుని అవతారమా అదంతా నాకు అక్కరలేదు. భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కరలేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కరలేదు. ఆయన దగ్గరనుండి నాకు శాంతి వస్తోంది, కాంతి వస్తోంది. ఆయన దగ్గరనుండి నేను ఏది పొందుతున్నానో అదే నాకు కావాలి. ఆయన ఈశ్వరుని అవతారం, కుమారస్వామి అవతారం అవ్వవచ్చు, కాకపోవచ్చు. ఆయన దగ్గరనుండి నాకు శాంతి, కాంతి వస్తున్నాయి. అదే నాకు కావలసింది అన్నారు చలంగారు. రమణచత్వారింశత్ చదవటం వలన మీకు రమణస్వామి మీద గౌరవం, భక్తి పెరుగుతుంది. నీటిలో ఉప్పుకరిగినట్లు ఆ భక్తి అనే గంగలో మన అహంకారం కరుగుతుంది. అందుకే భక్తి. భక్తే నిజమైన సొమ్ము. కొంతమంది ఎంత కష్టపడి చదువుకొంటారో, ఎంత కష్టపడి ధనం సంపాదించుకొంటారో అలాగే కొంతమంది అంత కష్టపడి భక్తిని సంపాదించుకొంటారు, వారు ధన్యులు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-07-2016, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఓం నమో భగవతే వేదవ్యాసాయ. ఈ రోజు వ్యాసపూర్ణిమ. అంటే వ్యాసుడు పుట్టినరోజు. ఈరోజున ఎవరి గురువును వారు దర్శించి, కృతజ్ఞత తెలియచేయటానికి ఈ వ్యాసపూర్ణిమను గురుపూర్ణిమగా మన పెద్దలు నిర్ణయించారు. చాలామందికి భక్తుల విలువ తెలియటంలేదు. అసలు మన భారతీయ సాహిత్యాన్ని పెంచిన వాళ్ళందరూ భక్తులే. వాల్మీకి, వేదవ్యాసుడు తరువాతకాలంలో పోతనామాత్యుడు వీళ్ళందరూ మహాభక్తులే. వాల్మీకి రాసిన రామాయణం ఎంతో మధురంగా ఉంటుంది. అలాగే వ్యాసుడు భారతం, భాగవతం రచించి ఎంతో సాహిత్యాన్ని ప్రసాదించాడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందిన వారు భౌతికాన్నికూడా ఆధ్యాత్మికంగానే చూస్తారు. వారు మన వంక చూసినా వారికి చైతన్యభావన తప్పించి ఏమీ ఉండదు. మనం అందరం చైతన్యంలోనే ఉన్నాము కాని వచ్చిన చిక్కు ఏమిటి అంటే మనం చైతన్యంలోనే ఉన్నాము అనే అనుభవం మనకు లేదు. లోపల చైతన్యం, బయట చైతన్యం, లోపల శాంతి, బయట శాంతి అంతటా వ్యాపించి ఉన్నది ఒక్కటే. అదే చైతన్యం. ప్రతీ వ్యక్తీ చైతన్యంలోనే ఉన్నాడు, చైతన్యానికి భిన్నంగా ఎవరూ లేరు.